# అమ్మమ్మా




అమ్మమ్మా
ఏం మహాత్మ్యం వుందే నీలో
ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు మనూరొస్తే
నా బుగ్గలు పుణికి ఆప్యాయంగా తల నిమురుతావు
అంతే...
ఆపాదమస్తకం ఎంత సాంత్వన నొందుతుందో
నీకోసం నే కొన్న చీర చేతికిచ్చి
పాదాలనంటితే ఆశీర్వదిస్తూ
నా మనవడు చీర పెట్టాడని ఊరంతా టముకేస్తావు
'బొత్తిగా చిక్కిపోయావురా కన్నా' అంటూ
రకరకాల రుచులు కొసరి కొసరి వడ్డించి
ఎప్పటినుండో చేస్తున్న డైటింగ్ నడ్డి విరుస్తావు
భుక్తాయాసంతో వగరుస్తుంటే
'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అంటూ పొట్ట మీద
చేత్తో నిమురుతావు
చెట్టంత ఎదిగి ఉద్యోగం చేసుకుంటున్నా
చేతులు పట్టుకుని పిల్లాడిని తీసుకెళ్లినట్టు
గుడికి తీసుకెళ్లి గోత్ర నామాలతో పూజ చేయించి
అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలిగేట్టు
కాస్త గట్టిగా దీవించమని పూజారిని గదమాయిస్తావు
ఇంటికొచ్చాక 'ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి' అంటూ దిష్టి తీసి
కాళ్లు, చేతులు, ముఖం నువ్వే కడుగుతావు
నీ గుండెల్లో నామీద అభిమానం
ఇలా గూడు కట్టుకుంటే
ఈ జన్మకింకేం కావాలే అమ్మమ్మా
నువ్వు చిరంజీవిగా వుండాలి
నేను చిరకాలం నీ ఆత్మీయతానుబంధంలో తన్మయుడినవ్వాలి!

- ప్రతాప వెంకటసుబ్బారాయుడు (సికింద్రాబాద్)

ఈశీర్షికకి వందల సంఖ్యలో కవితలు వస్తుంటాయి గనుక వాటిని ప్రచురణకి స్వీకరించినదీ లేనిదీ ఫోనులో చెప్పడం కష్టం. కాబట్టి కవితలు పంపించేవారు తగినన్ని స్టాంపులతో రిప్లయ్ కవరు జతచేసి వేచి చూడాల్సిందే. కవులు/ కవయిత్రులు సహృదయంతో అర్థం చేసుకోగలరని మా నమ్మకం.